# అమ్మమ్మకీ జై

(జనవరి, 2005 సిలికాన్ ఆంధ్రావారి "సుజనరంజని")

"ఈ రోజుల్లో దొంగతనాలు మరీ ఎక్కువై పోయాయిరా చంటీ! ప్రతిరోజూ దిన పత్రికల్లో అవేవార్తలు" మనవడికి అన్నం పెట్టడం అయ్యాక తనుకూడాతిని వంటిల్లు సద్దుకుని డ్రాయింగ్ రూమ్‌లో కొచ్చింది హైమ వతమ్మ.

"అబ్బా ! అమ్మమ్మా! అసలే రాత్రివేళ.. ఆ దొంగతనాల మాట లెందు కిప్పుడు?".

"ఓరి భడవా! మొగపిల్లాడివి.. నువ్వు భయపడుతున్నావా?"

"మొగైతే ఏవిటి? ఆడైతే ఏవిటి? ప్రాణం ఎవరిదైనా ప్రాణవేగా? అమ్మా నాన్న గారూ ఊర్నించి రేపుగానీరారు.. నాకు నిన్ను నీకునన్ను కాపలా పెట్టి వెళ్ళారు"

"నాకు నువ్వు సాయమా? నేనొక్క దాన్నీ ఉండగలను రోయ్ ! నీకు స్కూల్లో పరీక్షలున్నాయని నిన్ను తీసికెళ్ళ లేదుగానీ... నాకు నువ్వుసాయ మేంటి? నా చిన్నప్పుడు..."

"అమ్మమ్మా!" ఏతేలో కుట్టినట్టు కెవ్వుమని అరిచి ఆవిడమాటలు వినపడ కుండా టీ.వీ. శబ్దం పెంచేశాడు. తన చిన్నప్పటి సంఘటన లేవో కథలు కథలుగా గొప్పలు చెప్పడం మొదలు పెట్టిందంటే దానికి అంతుండదయ్యే మరి!

"అసలు రాను రాను ఈ కాలం పిల్లలకి బొత్తిగా భయంభక్తి లేకుండా పోయాయి. టీ.వి. బద్దలయ్యేలా సౌండ్ పెంచేస్తే అది బద్దలవదు గానీ నీచెవులే చిల్లు పడతాయి కర్ణభేరి అని ఏదో ఉంటుందిగా చెవుల్లో" మరిచెంబుతో మంచినీ ళ్ళు తెచ్చి పడుకునే చోట పెట్టుకోడానికి వంటింట్లోకి నడిచింది హైమవతమ్మ.

“అమ్మమ్మా!”

బిందెలోంచి చెంబులోకి నీళ్ళు వొంపుతున్న ఆవిడీసారి ఆకేకకి తుళ్ళిపట్టమే కాదు ఆవిడచేతిలోంచి చెంబుజారి కాలిమీద పడింది.

“ఓరినాయనోయ్! నాపనైపోయిందిరోయ్ ! నాకసలేషుగరు...”

తన అరుపుకి ప్రతి అరుపుగా వంటింట్లోంచి ఇంకో అరుపు వినపడేసరికి అసలే టీ.వీ. సీరియల్లో భయకరంగా అరిచిన మాంత్రికుడి కేకకి బెదిరిపోయిన చంటి బిగుసుకుపోయాడు కూర్చున్న కుర్చీలోనే టీ.వీ. వాల్యూమ్ తగ్గించేందుకు ఎదురుగా టీ పాయ్‌మీదున్న రిమోట్ తీసుకుందుకు చెయ్యి కూడా కదపలేకపోయాడు భయంతో.

కాలుపట్టుకుని కింద కూల బడిపోయిన హైమవతమ్మ మనవడిని కేకేసింది “ఒరే! ఇలా వొచ్చి నన్ను లేవదియ్యరా! ఆ టీ.వీ. వాళ్ళు ప్రపంచాన్ని మత్తులో ముంచేస్తున్నా ర్రా! వశీకరణ మంత్రం నేర్చుకున్నార్రా వాళ్ళు ఒరే! చంటీ వినిపించు కోవేరా! నీ టీ.వీ. దొంగ లెత్తుకుపోనూ.”

టీ.వీ.లో ఒక్క క్షణం బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఆగడంతో అమ్మమ్మ అన్న మాటల్లో ఆఖరి వాక్యం మనవడి చెవిలో పడింది.... అంతే... కళ్ళముందు ఆ మాంత్రికుడే కాదు.. పక్కన ఓ దొంగ కూడా కనపడుతున్నాడు. మనవడి కళ్ళు పెద్దవయ్యాయి.. ఆ దొంగ టీ.వీ.లోంచి బయటి కొచ్చాడు.

పిల్లాడి కాళ్ళు వణకడం మొదలెట్టాయి.

“అయ్యో! రామ చంద్రా ! లేపరాదా? ఇంతవాళ్ళు నా కెందుకిచ్చావని అడిగానా ఎప్పుడైనా ? కింద కూచుంటే లేవలేను కాబట్టి లేవదియ్యమని అడుగుతున్నానుగానీ.. ఒరేనాయినా చంటీ! వినిపించుకోవేరా? ఆ టీ.వీ. కనిపెట్టిన వాడు నాక్కనిపిస్తే వాడికి లోకమీ్మదింత కక్షెందుకో నేనడక్కపోను.. వాడి మీద నాపగ తీర్చుకోకాపోను ప్రతి ఇంట్లోనూ ఏవున్నా లేక పోయినా..ఓ టీ.వీ. మండుతుంటుంది కొరివి దెయ్యంలా...” హైమవతమ్మ వాగ్ధాటి సాగిపోతూనేఉంది.

టీ.వీ.లో మాంత్రి కుడి కెదురుగా వొచ్చింది ఓ దెయ్యం.

"నువ్వెందు కొచ్చావు?"

"నిన్ను మింగడానికి" దబ్బుమని కొట్టు కుంది కిటికీ తలుపు గాలికి అరిచానను కున్నాడు గానీ చంటి నోట్లోంచి చప్పరింత కూడా రాలేదు.

"హ హ్హా హ్హా హ్హా... నన్ను నువ్వు మింగుతావా? నిన్నీ సీసాలో బంధించి సముద్రంలోకి విసిరెయ్యగలను."

బిగుసుకుపోయాడు చంటి కిటికీ అవతల ఏదో కదిలినట్టయింది. చీకట్లో అదేవిటో తెలియలేదు... దొంగాడేమో? అసలీ అమ్మమ్మేవిటి వంటింట్లో కెళ్ళి మనిషివతలికి ఊడిపడదు... అమ్మ తనకోసం జంతికలు, చక్కిలాలు చేసిపెట్టి వెళ్ళింది.. పళ్ళుసగం ఊడిపోయాయి... ఉన్నరెండు పళ్ళూ కదుల్తున్నాయి..." గట్టివినవల్లేను అంటూ ఉంటుంది అమ్మమ్మ... అంతా ఉత్తిదే అన్నమాట... ఇప్పుడా వంటింట్లో కూచుని జంతికలు నవుల్తోందేమో తన ఎదురుగా తినడం ఎందుకని? అమ్మా! నువ్వనవసరంగా జంతికలూ అవీ చేసిపెట్టెళ్ళావు ఇప్పుడు చూడు... టీ.వీ.. సీరయల్స్ చూసేటప్పుడు పిల్లాడు భయపడతాడు పక్కన కూచుని వీపు రాద్దామనైనా లేకుండా వంటింట్లో కూచుని జంతికలు ఒక్కొక్కటీ నోట్లో నాన పెట్టుకుంటూ నవుల్తోంది ఇంకెప్పుడూ మనింట్లో జంతికలూ చక్కిలాలూ లాంటివి చెయ్యకు అమ్మమ్మ పళ్ళన్నీ ఊడిపోయేదాకా.

"రామచంద్రా... రామ అనే ఆ రెండక్షరాల్లో ఎంతో శక్తి ఉందంటారే! ఏది నాయనా ఇందా కట్నించీ నీ నామం తలుస్తూనే ఉన్నాను అయినా అంగుళం కూడా కదల్లేక పోయానే... అప్పట్లో టీ.వీ.లో నీ కథ ఎంత బాగా చూపించారు. రామాయణం వొచ్చేరోజుల్లో పొద్దున్నే మడి కట్టుకుని ముందు టీ.వీ. ముందు కూచుని కన్నీళ్ళు కాలవలు కడుతూ నీకథ చూసిగానీ మహానైవేద్యం సంగతిచూసే దాన్ని కాదు. సంపూర్ణ రామాయణం సినిమా ఎన్నిసార్లు మా దొక్కు సినిమాహాల్లో వొచ్చినా వొదలకుండా పక్కింటిపిల్లకో ఎదురింటిపిలకో రెండు రూపాయిలు లంచం ఇచ్చి సాయంతీసుకుని వెళ్తూనే ఉంటాను కదా! దయరాదా స్వామీ నామీద! ..

అసలు కంటే వడ్డీ ముద్దని... కొడుక్కంటే మనవడి మీదెంత ఆపేక్ష గుమ్మరిస్తు న్నాను... అయినావాడికి నేనంటే చీవతల కాయంతకూడా లక్ష్యంలేదు అయ్యోరామా! చీవఅనుకోగానే చీవలొచ్చాయిరా. ఉన్నాడుగా కోతి.. నేను చూడనప్పుడు ఆ కిందున్న పెద్ద పంచదార డబ్బా మూతతీసి ఇంతతిని ఇంత పారబోసుంటాడు... ఆడబ్బా దగ్గిర్నించే పేరంటాని కెళ్తున్నట్టు చీవల్లా నడుచుకుంటూ వొస్తున్నాయి.

మాంత్రి కుడు హాంపట్ అనగానే వీధి తలుపుధన్ మంది.

అసలే భయం భయంగా వేళ్ళ సందుల్లోంచి మాంత్రి కుడిని చూస్తున్న చంటి కుర్చీలోంచి దబ్బుమని జారిపడ్డాడు.

“అమ్మమ్మోయ్! ఎవరో తలుపుకొడుతున్నారు” ధైర్యం చేసి నోరైతే పెగుల్చుకున్నాడు గానీ... కిందనించి లేవడానికి తలుపు దగ్గిర కెళ్ళడానికి మాత్రం ధైర్యం చాల్లేదు.. సరిగ్గా అప్పుడే మళ్ళీ మాంత్రికుడు టీ.వీ. పేలిపోయేలా అరవడంతో చంటి మాటలు అందులోనే కొట్టుకుపోయాయి.. అమ్మమ్మ చెవుల పళ్ళేదు.

మరోసారి తలుపుదబదబా...

మనవడి గుండె దడ దడా...

ఇందాక కిటికీ దగ్గిర ఏదోకదిలిందిగా.. దొంగాడే అయ్యుంటాడు అమ్మానాన్న గారూ ఊళ్ళో లేరని తెల్సి వొచ్చుంటాడు... ఇంక లాభంలేదు.. ఆ అమ్మమ్మ.. ఎంత పిల్చినా రాదే!

లేచినిలబడితే కిటికీ బయటికి కనబడిపోతానని మెల్లిగా పాక్కుంటూ వంటింటివైపు వెళ్ళాడు.

“ఇక్కడ కూచుని నిద్రపోతున్నావా అమ్మమ్మా?”

“ఔన్నాయినా.. ఇంట్లో ఎక్కడా చోటు లేదని వంటింట్లో ఈ తూవు దగ్గిర చీవల్తో కుట్టించు కుంటూ కునుకు తీస్తున్నాను.. బాగానే అడిగావులే... గంటనించీ పిలుస్తుంటే చెవుల్లో సీసం పోసుక్కూచున్నావు.”

"ఇక్కడ కూచుని పిలవకపోతే అక్కడికి రావచ్చుగా నేనున్నచోటికి."

"లేచి అక్కడికి రాగలిగితే నిన్ను పిలవడం ఎందుకునాయినా? అలాపొక్కుంటూ వొస్తున్నావేంటి నువ్వు? నన్ను భయ పెడదామనుకున్నావా? నేనంత తేలిగ్గా భయపడేదాన్ని కాదునాయినా.. నా చిన్నప్పుడూ..."

"అమ్మమ్మా.."

"నేనిక్కడే ఉంటే అంత పెద్ద కేకెందుకురా పెడతావు? అయినా నేను నాచిన్నప్పుడు అనగానే ప్రతి సారీ ఎందుకలా ఏ పెద్ద పులినో చూసినట్టు అమ్మమ్మా అనరుస్తావు?.

"ఔను.. అక్కడికేదో పెద్దపులొస్తే నువ్వు దాంతో తలపడతావని..." నోటికి చెయ్యడ్డు పెట్టుకుని నవ్వాడు చంటి.

"నీ చిన్నప్పటి తెలివితేటలు కథలు మొదలు పెట్టావంటే వాటికి కామాలూ, ఫుల్ స్టాపులూ ఉండవన్న భయంతో... నాకు తెలియకుండానే అలా అరిచేస్తాను అమ్మమ్మా..."

"చాల్లే సంబడం.. ముందు నన్ను లేవదియ్యి..."

"నిన్ను నేను లేవదియ్య లేను బాబోయ్... నేను కింద పడతాను.."

"అయితే కాచుకో.... నా చిన్నప్పుడూ..."

"వొద్దుబాబోయ్! లేవదీస్తాను." చటుక్కున ఆవిడ చెయ్యి పట్టుకుని మెల్లిగా పైకి లేవదీశాడు. ఆవిడ తన రెండో చేత్తో గట్టు పట్టుకుని కష్టపడి లేచి నిలబడింది.

"తలుపెవరో చాలా సేపట్నించీ కొడుతున్నారమ్మమ్మా"

"ఆసంగతిప్పుడా చెప్పడం ? ఇంతాలస్యంగానా?"

"ఎవరో తెలియకుండా తలుపు తీసెయ్యకూడ దమ్మమ్మా... అమ్మ మరీ మరీ చెప్పివెళ్ళిందిగా!"

"ఔనురోయ్! అయినా నేనేవంత తొందరపాటుదాన్ని కాదు... ఎన్ని విన్లేదు? ఎన్ని చూడలేదు? పైగా నాచిన్నప్పుడు..."

"అమ్మమ్మా.. ముందు ఆవొచ్చిన వాళ్ళసంగతి చూడు"

"అలాగే...." తలుపుదగ్గిరకి నడిచింది..

"ఎవరూ? ఎవరదీ?"

"నేను బామ్మగారూ..." అవతల్నించి జవాబొచ్చింది.

"నేనంటే?"

"విజయవాడ నించొచ్చాను బామ్మగారూ.. మీ చుట్టాలబ్బాయిని..."

"మానాయినే మానాయినే.. ఈ మధ్య కాలంలో మా ఇంటికి చుట్టాలొచ్చి చాలా కాలం అయిపోయింది.. రాబాబూరా..." సంబరంగా తలుపు తీసింది హైమవతమ్మ.

భుజాన వేలాడేసంచీ... తెల్లచొక్కా.. నల్లప్యాంటు.. చక్కగా దువ్వుకున్న జుట్టు... కుర్రాడు బావున్నాడని మనసులో అనుకుంటూ మొహవంతా విప్పార్చుకు నవ్వుతూ "రాబాబూ..." అంటూ ఇంట్లోకి ఆహ్వానించింది.

కుర్రాడు చక్కగా ఉండడమేకాదు బుద్ధిమంతుడల్లే కూడా కనపడుతున్నాడు. సుందరమ్మ చెల్లెలి బావగారి బావమరిది కూతురికి చెప్పాలీసంబంధం.. ఏవైనా సంబంధాలు తెలిస్తే చెప్పమన్నారుగా వాళ్ళు.. హైమవతమ్మ ఆలోచనలు ఎక్కడికో వెళ్ళి పోయాయి..

"కూచోనాయినా... బస్సుకొచ్చావా?"

"ఔనండీ"

"విజయవాడలో సావిత్రమ్మొదినా వాళ్ళ మనవడయ్యుంటాడు.. సావిత్రమ్మొదిన పోలికలు కొద్దిగాకనిపిస్తున్నాయి.. ఎవరు నువ్వని అడిగితే బావుండదు... ఏవన్నా అనుకోదూ. వెళ్ళాక ఆవిడగారితో చెప్పదూ ఇలా అడిగానని..

అసలే ఆవిడగారికి ముక్కు మీదుంటుంది.. కోపం.... వేలువిడిచిన మేనత్త కూతుర్ని ఎంత తేలిగ్గా మర్చిపోయింది? రాకపోకలాగిపోయి ఎన్నాళ్ళయి పోతేమాత్రం మర్చిపోతుందా అంటూ అటుఏడు తరాలకి ఇటు ఏడుతరాలకి సరిపడా తిట్టిపొయ్యదూ?

మంచి నీళ్ళగ్లాసందించింది. "నీసంచీ ఆగదిలో పెట్టుకో బాబూ స్నానానికి వేడి నీళ్ళుకాస్తాను. నువ్వు స్నానంచేసొచ్చేలోపల అన్నం వొండేస్తాను."

"నేను హోటల్లో భోజనం చేసేవొచ్చానండీ..."

"ఎంతపని చేశావుబాబూ? నీ కిది న్యాయంకాదు"

మంచినీళ్ళు తాగుతూ తుళ్ళిపడ్డాడా మాటకి.. పొలమారింది.

"ఇలా వొచ్చావో లేదో... అప్పుడే సావిత్రమ్మొదిన తల్చేసుకుంటోంది నిన్ను"

"ఆవిడెవరండీ?"

"తప్పు బాబూ తప్పు.. ఏదో అత్తాకోడళ్ళకి మీ అమ్మకీ మీ బామ్మకీ ఎంత పడకపోతే మాత్రం.. నువ్వలా మీ బామ్మని ఆవిడెవరు అనెయ్యకూడదు..."

"అబ్బే! ఊరికే సరదా కన్నానండీ... నాకు మా బామ్మంటే ప్రాణం..."

"ఎంత మంచిమాట చెప్పావు బాబూ! మనవలంటే అలా ఉండాలి. నేను నీకు అమ్మమ్మ నవుతాను నాయినా..."

"అలాగాండీ? ఏవిటో.. వరసలు సరిగ్గా గుర్తులేక బామ్మగారూ అనే శాను"

"మరేం పర్వాలేదులే.. ఎలాపిల్చినా ఏవీ అనుకోను ఊరికే చెప్పానంతే"

"మరి నేవెళ్ళొస్తానండీ..."

"అదేవిటప్పుడే వెళ్ళిపోడం.. ఉండాలి నాల్రోజులు.. మా అమ్మాయీ అల్లుడూ ఊరెళ్ళారు రేపొస్తారు. నిన్ను చూసి ఎంతో సంతోషిస్తారు"

"లేదండీ... నేను అర్జంటుగా మా ఊరెళ్ళి పోవాలి. ఇంకో అరగంటలో నాకు బస్సు ఈ రోజు పొద్దున్నొచ్చానీ ఊరు ఉద్యోగం ఇంటర్వ్యూ కోసం మా ఫ్రెండొకడు కొత్తగా ఉద్యోగంలో చేరినవాడు రూమ్ తీసుకుని ఉంటున్నాడు వాడి దగ్గర కెళ్ళి తర్వాత ఇటొస్తున్నాను.. ఈ ఊరొచ్చికూడా మిమ్మల్ని కలవకుండా వెళ్ళిపోడానికి మనసొప్పక మీ అడ్రసు వెతుక్కుంటూ వొచ్చాను. తీరామీ ఇంటి దగ్గర బస్‌స్టాప్‌లో బస్‌దిగి చూసుకుంటే జేబులో పర్సులేదు. బస్‌లో ఎవరో కొట్టేశారు... ఇప్పుడర్జెంటుగా మా ఊరెళ్ళాలి మీ అల్లుడు గారు కూడా ఊళ్ళో లేరు..." నసుగుతూ తలగోక్కున్నాడు "అయ్యోదాని దేముంది నాయినా? నేను లేనూ? ఎంతకావాలి చెప్పు?"

"ఒక్క అయిదొందలు. ఊరెళ్ళగానే పంపించేస్తానండీ..."

"భలేవాడివేలే.. అంత మొహ మాటపడిపోతావేంటీ అమ్మమ్మదగ్గిర?" అంటూ లోపలిగదిలో కెళ్ళి తన పెట్లోంచి అయిదొందలు తీసుకొచ్చి ఇచ్చింది హైమావతమ్మ.

"వొస్తానండీ. థ్యాంక్సండీ"

అత నెళ్ళిపోతుంటే వీధి గుమ్మందాకావొచ్చి వెనకనించి మరీ మరీ చెప్పింది "సావిత్రమ్మొదిన్ని అడిగానని చెప్పు"

మర్నాడు పొద్దున్న ఊర్నించి వొచ్చిన కూతురు, అల్లుడుతో పాటూ వెనకేవొస్తున్న కొత్త వ్యక్తిని ఎవరా అన్నట్టుగా చూసింది హైమవతమ్మ.

"అమ్మా! ఇతన్ని గుర్తు పట్టావా? లేదులే... ఎన్నాళ్ళో అయిపోయింది. నువ్వు చూసి.. గుర్తు పట్ట లేవు... సావిత్రమ్మత్తయ్య మనవడు... నువ్వెన్నాళ్ళనించో సావిత్రమ్మొదిన గురించి కలవరించి పోతున్నావుగా... వాళ్ళందర్నీ చూసి చాలాకాలం అయిపోయిందని.. మేం దిగిన రైల్లోనే ఇతనూదిగాడమ్మా. ఏదోపనుండి ఈ ఊరొచ్చాడుట మళ్ళీ రెండ్రోజుల్లో వెళ్ళిపోవాలిట.. స్టేషన్లోంచి బయటి కొస్తుంటే

కనిపించాడు ఈ మధ్యే ఆర్నెల్ల కిందటే ఏదో ఊళ్ళో కలిశాను. కాబట్టిగుర్తు పట్టాను. మా ఇంట్లో దిగకుండా హోటల్లో దిగడం ఏమిటీ అని మాతోతీసుకొచ్చాం" హైమవతమ్మ మొహంలోరంగులు మారాయి..

కన్నార్పకుండా ఆవిడ మొహంలోకే చూస్తున్నాడు చంటి

"అదిసరేగానీ అమ్మాయ్! సావిత్రమ్మొదినకి మనవడొక్కడేగా?" కూతురి వెనకాలే గదిలోకినడిచింది.

"ఔనూ... కాదని నేనెప్పుడన్నానూ?"

నిలబడ్డచోటే నేలకి అతుక్కుపోయినట్టుగా నిలబడిపోయింది హైమవతమ్మ.

"ఊ.. ఇప్పుడు చెప్పు అమ్మమ్మా నీచిన్నప్పటి తెలివితేటలకథలు వినాలని ఉంది" పక్కన చేరి వేళాకోళం ఆడాడు చంటి.

"ఓరి భడవా!" వీపుమీద ఒకటి వెయ్యబోయింది.

"నా చిన్నప్పుడూ.." దీర్ఘంతీస్తూ పకపకానవ్వుతూ పారిపోయాడు చంటి.

★ ★ ★